సాక్షి
వనపర్తి

గురువారం । 22 । మే । 2025



హడలెత్తిస్తున్న మొసళ్లు

కృష్ణా మండలంలో మొసళ్ల సంచారం ప్రజలను హడలెత్తిస్తోంది.

వివరాలు 8లో ▶



ఘనంగా పహిల్వాన్ ఉర్సు

అలంపూర్‌లో షాఅలీ పహిల్వాన్ ఉర్సు ఘనంగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /24.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలి



వనపర్తి రూరల్: కార్మికుల హక్కుల సాధన కోసం జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులందరూ సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. హక్కులను కాలరాస్తుందన్నారు. లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందన్నారు. కార్మికులు హక్కుల కోసం పోరాడితే పోలీసులతో అరెస్టులు చేయిస్తూ.. కేసులు పెడుతున్నారని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నుంచి నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నాయకులు బొబ్బిలి నిక్సన్, కె.సునీత, ఆర్ఎస్ రమేశ్, గంధం మధన్, ఎస్.రాము, శారద ఉన్నారు.

రానున్న రోజుల్లో కంప్యూటర్ ఆధారిత విద్య

గోపాల్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ ఆధారిత విద్య అందించనున్నట్లు జిల్లా విద్యా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోపాల్‌పేట, ఏదుల, రేవల్లి మండలాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సులభ పద్ధతుల్లో బోధించడంతో పాటు విద్యా బోధనలో సాంకేతికతను జోడించాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో బోధన చేయబోతున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లితండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

ధాన్యం కేటాయింపుల్లో నిబంధనలు బేఖాతరు



వనపర్తి మండలంలో సాటెక్స్ యంత్రాలు లేని మిల్లు

- జిల్లాలో 74 రైస్‌మిల్లుల ఎంపిక
- సగానికి పైగా మిల్లుల్లో సాటెక్స్, బ్లెండింగ్ యంత్రాలు కరువు
- బియ్యం నాణ్యతపై తీవ్ర ప్రభావం

వనపర్తి: రైస్‌మిల్లులకు సీఎంఆర్ కేటాయింపుల్లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చితే చాలు.. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నా, మిల్లుల్లో సాటెక్స్, బ్లెండింగ్ యంత్రాలు లేకపోయినా ధాన్యం కేటాయింపులు చేస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. సాటెక్స్ యంత్రాలు లేని మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయవద్దని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. ఇక్కడి అధికారులు సీఎంఆర్ నాణ్యతా విషయాన్ని గాలికి వదిలేసి.. తమ స్వలాభం కోసం నచ్చిన మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. బియ్యం అప్పగించే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే తమకేంటి నష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

బ్లెండింగ్ యంత్రాలు తప్పనిసరి..

కేంద్ర ప్రభుత్వం పేదలకు పౌష్టికాహారంతో కూడిన బియ్యం సరఫరా చేయాలనే సదుద్దేశంతో సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించిన మిల్లులకు పౌరసరఫరాల శాఖ నుంచి ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్ సరఫరా చేస్తోంది. వాటిని సమపాళ్లలో కలిపి మిల్లర్లు సీఎంఆర్ అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా బ్లెండింగ్ యంత్రాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే నిర్దేశించిన మేరకు ప్రతి 50 కేజీల బస్తాకు అర కిలో పౌష్టికాహారం గల బియ్యం కలుపబడుతుంది. కానీ మిల్లర్లు చాలా మంది ఈ యంత్రాలను సైతం ఏర్పాటు చేసుకోలేదు. సదరు మిల్లర్లు పౌరసరఫరాలశాఖ అధికారులను ప్రసన్నం చేసుకుని ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిక్లరేషన్ తీసుకున్నాం..



సాటెక్స్ యంత్రాలు లేని కొత్త మిల్లులకు ధాన్యం కేటాయించలేదు. అయితే పాత మిల్లర్లతో రెండు, మూడు నెలల్లో ఏర్పాటు చేసుకుంటామని చెప్పడంతో.. వారితో డిక్లరేషన్ తీసుకుని ధాన్యం కేటాయించాం. పాత మిల్లుల్లో కొన్నింటిలో సాటెక్స్ యంత్రాలు లేని మాట వాస్తమే.. త్వరలో ఏర్పాటు చేయిస్తాం.

– కాశీవిశ్వనాథ్, డీఎస్‌ఓ

సగానికి పైగా మిల్లుల్లో..

సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించాలంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, డీఎస్‌ఓ మిల్లులను పరిశీలించాలి. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ రూపొందించిన నిబంధనల మేరకు మిల్లుల్లో సాటెక్స్, బ్లెండింగ్ యంత్రాలు ఉన్నాయా.. ధాన్యం స్టోరేజీ కోసం గోదాములు, తూకాలు వేసేందుకు వే బ్రిడ్జి, ఆధునిక యంత్రాల సామర్థ్యం తదితర వివరాలను పరిశీలించిన తర్వాత ధాన్యం కేటాయింపులకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. కానీ ఇవేవీ లేకుండా స్థానిక పౌరసరఫరాలశాఖ అధికారులు అడ్డగోలుగా ధాన్యం కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై టాస్క్‌ఫోర్స్ విచారణ చేపడితే.. చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సాటెక్స్ యంత్రంతో బియ్యం నాణ్యత..

మిల్లులో ధాన్యాన్ని శుద్ధి చేసేందుకు, బియ్యం రంగు మారకుండా నాణ్యతగా మరాడించేందుకు సాటెక్స్ యంత్రాన్ని ప్రతి రైస్ మిల్లులో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని.. ఈ యంత్రం ఏర్పాటు చేసుకున్న మిల్లులకే సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయింపులు చేయాలని స్పష్టమైన ఆదేశాలున్నాయి. బియ్యాన్ని స్క్రీనింగ్ చేయడంతో పాటు కలుషితాలను ఈ యంత్రం సమర్థవంతంగా తీసివేసి శుద్ధి చేస్తుంది. ఈ యంత్రంలోని సెన్సార్లు బియ్యం రంగు, సైజును స్పష్టంగా గుర్తించి.. రంగుమారిన బియ్యం గింజలతో పాటు సాధారణ బియ్యం గింజ కంటే తక్కువ సైజు (నూకలను) వేరు చేస్తుంది. చెడు గింజలను గుర్తించి వెంటనే ఎయిర్ ప్రెషర్‌తో వాటిని బయటకు నెట్టివేస్తుంది. సీఎంఆర్ అప్పగించే మిల్లుల్లో ఈ సాటెక్స్ మిషన్లు ఉంటేనే.. ప్రజాపంపిణీ వ్యవస్థకు నాణ్యమైన బియ్యం వస్తాయనే దృక్పథంతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పై నిబంధనలను రూపొందిస్తే.. స్థానిక అధికారులు వారి స్వార్థం కోసం నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు.

ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దు

కొత్తకోట రూరల్: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వేగంగా తరలించేందుకు అదనపు లారీలను అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. బుధవారం కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో అదనపు కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దన్నారు. వీలైనంత వేగంగా ధాన్యాన్ని తరలించేందుకు అదనంగా లారీలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తకోట మండలంలో 80శాతం పైగా ధాన్యాన్ని తరలించినట్లు చెప్పారు. అనంతరం పెద్దమందడి మండలం మోజర్ల శివారులోని రైస్ మిల్లును అదనపు కలెక్టర్ పరిశీలించారు. మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి.. మండలంలో ఇంకా ఎంత ధాన్యం తరలించాల్సి ఉంది.. ఎన్ని లారీలు కావాల్సి ఉందనే వివరాలను అధికారులతో తెలుసుకున్నారు.



లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

నిలిచిన 'సీయూఈటీ'



ఫాతిమా విద్యాలయ పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- షార్ట్‌సర్క్యూట్ కారణంగా పనిచేయని కంప్యూటర్లు
- మహబూబ్‌నగర్ 'ఫాతిమా' స్కూల్ కేంద్రంలో పరీక్షకు దూరమైన 180 మంది విద్యార్థులు
- న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీ (అండర్ గ్రాడ్యుయేషన్) స్థాయిలో సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం దేశవ్యాప్తంగా సీయూఈటీ (కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్టు) నిర్వహిస్తోంది. వివిధ గ్రూపుల విద్యార్థులు ఈ నెల 13 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తున్నారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 180 మంది విద్యార్థులు బుధవారం ఉదయం సెషన్ 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఉదయం వర్షం కారణంగా పాఠశాల కంప్యూటర్ ల్యాబ్ ఉన్న ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కంప్యూటర్లు సైతం ఆఫ్ అయ్యాయి. గంట తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా.. మళ్లీ 10 నిమిషాల్లోనే మరోసారి షార్ట్ సర్క్యూట్‌తో సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 180 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడంతో వారి తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.

దేశవ్యాప్తంగా కొనసాగిన పరీక్ష

దేశవ్యాప్తంగా 60కి పైగా సెంట్రల్ యూనివర్సిటీల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు ఆన్‌లైన్‌లో ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ఒక్కో విద్యార్థి రూ.950 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా పరీక్ష కొనసాగగా.. ఒక్క మహబూబ్‌నగర్‌లోని ఫాతిమా విద్యాలయ పరీక్ష కేంద్రంలో మాత్రం జరగలేదు. పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రం కూడా బయటికి వచ్చాక.. మరోసారి పరీక్ష ఎలా నిర్వహిస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఈ విషయంపై ఫాతిమా విద్యాలయ ప్రిన్సిపాల్ థెరిస్సా మాదను స్పందిస్తూ.. పరీక్ష నిర్వహణలో ఏర్పడిన అంతరాయంపై ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి) సమాచారం ఇచ్చామని.. మరోసారి పరీక్ష నిర్వహించే విధంగా ఎన్టీఏ చర్యలు తీసుకుంటుందని చెప్పినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

పరీక్ష జరగలేదు.



సీయూఈటీ పరీక్ష రాసేందుకు రాత్రి బయలుదేరి మద్దూరు నుంచి వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చాక షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు పనిచేయలేదు. దీంతో పరీక్ష రాయకుండా వెనుదిరిగే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

– మహేశ్‌కుమార్, విద్యార్థి, మద్దూరు


వర్షంలో తడుచుకుంటూ వచ్చాం..



రాత్రి 2 గంటలకు గద్వాల నుంచి బయలుదేరి, ఉదయం 6 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకున్నాం. షార్ట్ సర్క్యూట్‌తో పరీక్ష నిలిచిపోతే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కరెంట్ పోతే మేమేం చేయాలని పేర్కొంటున్నారు. అలాంటప్పుడు పరీక్ష కేంద్రం ఎందుకు పెట్టుకోవాలి. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి మా పిల్లలకు న్యాయం చేయాలి.

– సునీత, విద్యార్థిని తల్లి, గద్వాల

ఏపీ ఎంసెట్ వదులుకున్నా..



పరీక్ష ప్రారంభమైన కొన్ని నిమిషాలకే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంటసేపు వరకు పునరుద్ధరించలేదు. అప్పటికే సమయం కూడా ముగిసింది. అనంతరం పరీక్ష నిర్వాహకులు వచ్చి పరీక్షకు మరోసారి ఎన్టీఏ వారు సమాచారం ఇస్తారు.. అప్పుడు వచ్చి పరీక్ష రాయాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పరీక్షలు రాసి ఇక్కడ మాత్రం నిర్వహించలేదు. ఏపీ ఎంసెట్ వదులుకుని ఈ పరీక్షకు వచ్చాను. న్యాయం చేయాలి.

– సాయివర్షిణి, విద్యార్థి, మరికల్

మరో అవకాశం ఇవ్వాలి..

సీయూఈటీ పరీక్ష రాయడానికి మరికల్ నుంచి వచ్చాను. కొన్ని రోజులుగా పరీక్ష కోసం సిద్ధమయ్యాను. తీరా పరీక్షకు వస్తే విద్యుత్ సరఫరా నిలిచిపోయి కంప్యూటర్లు పనిచేయలేదు. ప్రభుత్వం మరోసారి పరీక్ష నిర్వహిస్తుందా.. లేక రీషెడ్యూల్ చేస్తారా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలి.

– రామకృష్ణ, విద్యార్థి, మరికల్



సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి 29వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షలు
- జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 5,723 మంది విద్యార్థులు



బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈఓ ఎర్ర అంజయ్య

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రథమ సంవత్సరంలో 3,631 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,092 మందితో కలిపి మొత్తం 5,723 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఒక డీఈసీ, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాల ఏర్పాట్లను డీఐఈఓ ఎర్ర అంజయ్య పరిశీలించారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

లబ్ధిదారుల ఎంపిక వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- రాజీవ్ యువవికాసం పథకానికి 28,110 దరఖాస్తులు
- నెలాఖరులోగా అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి 28,110 దరఖాస్తులు అందగా.. అర్హులైన యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రూ. 126.34 కోట్లు సబ్సిడీ రూపంలో మంజూరయ్యాయని చెప్పారు. ఇందులో వనపర్తి నియోజకవర్గానికి రూ.72.03 కోట్లు మంజూరు కాగా.. 15,388 దరఖాస్తులు వచ్చాయన్నారు. మక్తల్ నియోజవర్గానికి సంబంధించి రూ. 14 కోట్లు మంజూరు కాగా.. 3,114 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. దేవరకద్ర నియోజకవర్గంలో 4,334 మంది దరఖాస్తు చేసుకోగా.. రూ.9.24 కోట్లు మంజూరయ్యాయన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి రూ. 22.19 కోట్లు మంజూరు చేయగా.. 5,274 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖలకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి.. నెలాఖరులోగా అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మైనార్టీ కార్పొరేషన్ అధికారి అఫ్జలుద్దీన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి..

జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కేంద్రం నుంచి పాన్‌గల్, కొత్తకోట, పెబ్బేరు వెళ్లే రహదారుల విస్తరణపై కలెక్టర్ తన చాంబర్‌లో అటవీ శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న దుకాణాలు, ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి.. భవనాల కూల్చివేతలు ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా పెబ్బేరు రోడ్డు, ఎకో పార్కు, ఔటర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ స్కూల్‌కు సంబంధించి అటవీ భూముల విషయంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. సమావేశంలో డీఎఫ్‌ఓ ప్రసాద్ రెడ్డి, ఆర్ఎఫ్‌ఓ అరవింద్‌రెడ్డి, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు



కార్యకర్తల సమావేశంలో ఐక్యతను చాటుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఇతర నాయకులు

వనపర్తి: వందేళ్లకు పైగా చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ ఒక వటవృక్షం లాంటిదని.. పార్టీ నీడన ఉండే ప్రతి నాయకుడు, కార్యకర్తను కాపాడుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో కొందరు ప్రతిపక్ష నాయకులు శిఖండి రాజకీయాలు చేస్తూ.. కాంగ్రెస్ పార్టీలో కుటుంబ తగాదాలు ఉన్నాయంటూ అసత్య విమర్శలు చేస్తున్నారన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు పరిశీలకులు సంజయ్ ముదిరాజ్, గౌరీ సతీష్ సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశం తమ ఐక్యతను చాటుతోందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలోనే అప్పులకుప్పగా మార్చిందని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం కొత్త, పాత భేదం లేకుండా పనిచేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు లభిస్తాయన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ డెలిగేట్ శంకర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



మతపెద్దల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

- పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్, హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మత పెద్దలతో ఏర్పాటుచేసిన శాంతి సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. బక్రీద్, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు సమన్వయం చేయాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత పత్రాలు ఉంటేనే అనుమతిస్తారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని.. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకురావద్దని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే.. సామరస్య పరిష్కారానికి పోలీసు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రజల ఐక్యత, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. అదే విధంగా సభలు, సమావేశాలు, ర్యాలీలకు కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈద్గాల్లో సామూహికంగా ప్రార్థన కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, పశువైద్యశాఖ ఏడీ మీరజ్ అహ్మద్, వెటర్నరీ డాక్టర్ మల్లేష్ ఉన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి


పెద్ద బాలయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలోని 12వ వార్డులోని విద్యానగర్ కాలనీకి చెందిన వయోవృద్ధుడు బకెట పెద్ద బాలయ్య (104) వృద్ధాప్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. 1921లో జన్మించిన పెద్ద బాలయ్య పట్టణంలోనే కాక మండలంలోనే అత్యధిక వయస్సు గల వ్యక్తిగా జీవించారు. బాలయ్య మృతి విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళ్లు అర్పించిన వారిలో బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు గొనికాడి రాములు యాదవ్, లాల్‌కోట రవి, పీఏసీఎస్ డైరెక్టర్ చాపల భాస్కర్, గట్టున్న, చిలుకటి బుచ్చన్న తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్కపల్లి మండలంలోని గట్టురాయిపాకుల గ్రామానికి చెందిన చటమోని రాములు (38) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్న రాములును కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బుధవారం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా



కారు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన చటమోని రాములు కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులు బుధవారం మధ్యాహ్నం జనరల్ ఆస్పత్రి ఎదుట ధాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ కనకయ్యగౌడ్ అక్కడికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పలువురు మాట్లాడుతూ మృతుడిని ఢీకొన్న కారులో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ ఉన్నప్పటికీ తీవ్రంగా గాయపడిన చటమోని రాములును పరామర్శించకుండా వెళ్లడం దారుణమని మండిపడ్డారు.

ఎద్దు పొడవడంతో వ్యక్తి మృతి

మానవపాడు: ఎద్దులను కల్లంలో కట్టియడానికి వెళ్లగా ఓ ఎద్దు పొడవడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జల్లాపురంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. మానవపాడు మండలం జల్లాపురానికి చెందిన చిన్న గోపాల్‌నాయుడు (72) ఈ నెల 17న ఎద్దులను కట్టియడానికి కళ్లానికి వెళ్లాడు. ఈ క్రమంలో గోపాల్‌నాయుడు కాలుకు తాడు చుట్టుకొని ఉండగా ఓ ఎద్దు వచ్చి అతడిని పొడిచింది. తీవ్రగాయాలు కాగా కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రసవ వేదనతో ప్రాణాలు కోల్పోయిన బాలింత


జ్యోతిబాయి (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన జ్యోతిబాయి (30) మూడు రోజులుగా ప్రసవ వేదనతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. జ్యోతిబాయి మూడో కాన్పు కోసం వనపర్తి ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రసవం అయిన కొద్దిసేపటికే పసిబిడ్డ చనిపోగా.. రెండు రోజులు చికిత్స పొందిన తర్వాత బాలింత జ్యోతిబాయి కూడా మృతి చెందింది. చికిత్స కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసినా భార్య, కుమార్తె మృతి చెందారని మృతురాలి భర్త శివాజీ వాపోయారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కసాయి తల్లికి రిమాండ్

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన మేకల ఎల్లమ్మను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. ఈ నెల 20న ఎల్లమ్మ తన చిన్న కూతురు నవిత(6)ను నీటి సంపులో వేయడంతో మృతి చెందిన విషయం విధితమే. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ రవీందర్, ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ ఎల్లమ్మను అదుపులోకి తీసుకొని కొల్లాపూర్ కోర్టులో హాజరు పరిచగా రిమాండ్ విధించడంతో మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

హడలెత్తిస్తున్న మొసళ్లు


భీమానదిలో రైతును మొసలి లాకెళ్లిన ప్రదేశం

- నిత్యం ప్రమాదాల బారిన ప్రజలు
- రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వినతులు
- భీమా, కృష్ణానదిలో వందల సంఖ్యలో మొసళ్ల సంచారం

కృష్ణా: మండలంలో ఒక పక్క భీమానది, మరో పక్క కృష్ణానది ప్రవహిస్తుండడంతో ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రైతులు నది నుంచి వ్యవసాయ పొలాలకు నీరు తరలించేందుకు నది ఒడ్డున మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో నీటి మోటార్ల వద్ద మొసళ్ల దాడులతో మృత్యువాత పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రభుత్వం నది ఒడ్డున నీటిలో మోటార్లు ఏర్పాటు చేసుకున్న చోట రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

రైతును లాక్కెళ్లిన మొసలి

మండలంలోని కుసుమర్తి గ్రామానికి చెందిన రైతు తిప్పణ్ణను గత శనివారం మొసలి లాక్కెళ్లడంతో ప్రాంత రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాలుగు రోజులైన అతని ఆచూకీ లభించక లేదు. మొసలి రక్తం రూచి చూడటంతో అదే ప్రాంతంలో సంచరిస్తుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నది తీరం వద్ద రెస్క్యూటీం, ఫైర్, రెవెన్యూ, పోలీసు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

ఆచూకీ కోసం విశ్వప్రయత్నాలు

నదిలో మొసలి పట్టుకెళ్లిన రైతు తిప్పణ్ణ ఆచూకీ కోసం గత శనివారం మధ్యాహ్నం నుంచి నేటి వరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు, రెస్క్యూ అండ్ ఫైర్ డిపార్ట్‌మెంట్, గజ ఈతగాళ్లు విశ్వ ప్రయత్నం చేస్తున్నా ఆచూకీ లభించడం లేదు. రాత్రీపగలు తేడా లేకుండా సంఘటన ప్రాంతంలోనే అన్నిశాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కంచే లేక జాలి నిర్మించాలి

ప్రభుత్వం నది ఒడ్డున మోటర్లు ఏర్పాటు చేసుకున్న చోట, నీటి మడుగులు ఉన్నచోట కంచె లేదా జాలిని ఏర్పాటు చేయాలని రైతులు కోరతున్నారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగకుండగా తగు చర్యలు తీసుకోవాలంటున్నారు. లేదా నదుల్లోని మొసళ్లను వేరే ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..



భీమానదిలో గత శనివారం నుంచి అధికారులతో కలిసి రెస్క్యూ అండ్ ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీసులు, అటవీశాఖ అధికారులుతో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఈ నెల 21న బుధవారం 12 మంది ఎన్‌డీఆర్ఎఫ్ బృందం చేరుకుంది.

– పుష్పలత, తహసీల్దార్, కృష్ణా

రక్షణ కల్పించాలి



భీమా నదిలో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. ప్రధానంగా నదిలో రైతుల మోటర్లు ఏర్పాటు చేసుకున్న చోట కంచె ఏర్పాటు చేయాలి.

– సూకూర్‌లింగంపల్లి అంజనేయులు, రైతు

ఆవేదనలో ఉన్నాం



మా కుటుంబానికి చెందిన తిప్పణ్ణను మొసలి లాకెళ్లి నాలుగు రోజులవుతుంది. ఇంత వరకూ ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులమంతా తీవ్ర ఆవేదనలో ఉన్నాం. తిప్పన్న ఆచూకీ కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురు చూస్తున్నాం.

– శరణప్ప, బాధిత కుటుంబ సభ్యుడు

దివ్యాంగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివప్ప

మహబూబ్‌నగర్ రూరల్: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ 10లోపు మార్చాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.మధుబాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడివయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 43.02 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, 2014లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 10.48 లక్షల మంది ఉంటే కేవలం 4,90,044 మందికే పెన్షన్లు వస్తున్నాయన్నారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వేధింపులపై చర్యలేవీ..

మహిళా దివ్యాంగులపై అత్యాచారాలు, లైగింక వేధింపులు, దివ్యాంగులపై దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. వైకల్యం కలిగిన విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యాసంస్థలు లేకపోవడం వల్ల వారు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని వాపోయారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహం రూ. 2 లక్షలకు పెంచడంతో పాటు జంటలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశప్ప, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలేశ్వర్, నాయకులు నర్సిములు, రాధమ్మ, భాగ్యలక్ష్మి, కుర్మయ్య, మంగమ్మ, భానుప్రకాష్, తిరుపతయ్య, సురేష్, బాబు, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు ప్రశంస


ప్రశంసా పత్రం అందుకుంటున్న జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్

- అభినందించిన డీజీపీ జితేందర్
- స్ఫూర్తి పొందాలన్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖలోని నలుగురు అధికారులకు డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ.. నలుగురు అధికారులు ప్రశంసాపత్రాలు పొందడం జిల్లాకే గర్వకారణమన్నారు. జిల్లాలో ఉన్న మిగిలిన సిబ్బంది స్ఫూర్తిగా తీసుకొని మరింత ఉత్తేజంతో పని చేయాలని సూచించారు. ప్రతి కేసును సమగ్రంగా పరిశీలిస్తూ, బాధితులకు న్యాయం అందించడం వల్లే ఈ గుర్తింపు దక్కిందన్నారు.

ప్రతిభ కనబర్చిన అధికారులు..

60 రోజుల వ్యవధిలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువ పోక్సో కేసుల్లో చార్జిషీట్ నమోదు చేసినందుకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన రూరల్ సీఐ గాంధీనాయక్, అవుట్ స్టాండింగ్ కేసుల డిటెక్షన్‌లో మూడో స్థానంలో నిలిచిన జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పరిష్కారంలో మొదటి స్థానం నిలిచిన మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్, సీఈఐఆర్, క్యూఆర్ కోడ్ వినియోగంలో ఐదవ స్థానంలో నిలిచిన నవాబ్‌పేట ఎస్ఐ విక్రమ్‌ను డీజీపీ ప్రశంసా పత్రంతో అభినందించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


నవాబ్‌పేట ఎస్ఐ విక్రమ్‌ను ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న డీజీపీ జితేందర్

ఘనంగా షా అలీ పహిల్వాన్ ఉర్సు


చిన్న కిస్తీ పోటీల్లో యువకుల సందడి


కిస్తీ పోటీలను వీక్షిస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో గంధోత్సవం
- నేడు పెద్ద కిస్తీ పోటీల నిర్వహణ

అలంపూర్ : అలంపూర్‌లో వెలిసిన షా అలీ పహిల్వాన్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. ఉత్సవాల రెండో రోజు బుధవారం సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ పోటీలు జరిగాయి. గుల్బార్గా నుంచి గంధం తీసుకొచ్చారు. ఇక్కడికి వచ్చిన గంధంను మత పెద్దలు సుగంధ ద్రవ్యాలు కలిపి సిద్ధం చేశారు. అనంతరం మేళతాళాల మధ్య సయ్యద్ ఖాదర్ బాష ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి గంధం తీసుకొచ్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం సర్ ముబారక్ దర్గా తర్వాత దడ్ ముబారక్ దర్గాకు తీసుకెళ్లి గంధోత్సవ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం చిన్న కిస్తీ పోటీలు జరిగాయి. యువకులు వివిధ రకాల విన్యాసాలను చేస్తూ కిస్తీ పోటీల్లో పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి దర్గాలో మొక్కులు చెల్లించి ప్రార్థనలు జరిపించారు. మొక్కులు తీర్చుకునే క్రమంలో కిస్తీలో పలావ్, మిఠాయిలు వేయగా యువకులు పోటీ పడి వాటిని భక్తులపైకి విసిరారు. ఈ క్రమంలో పోటికి దిగిన పహిల్వాన్‌లు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నేడు పెద్ద కిస్తీలు

షా అలీ పహిల్వాన్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు దడ్ ముబారక్ దర్గాలో పెద్ద కిస్తీ పోటీలు గురువారం జరగనున్నాయి. పెద్ద కిస్తీ పోటీలను తిలకించడానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండు కుటుంబాల్లో గుండెపోటు విషాదం

- వదిన అంత్యక్రియలకు వెళ్తూ మరదలు మృతి


చాకలి చంద్రమ్మ


పేరూర్ నర్సమ్మ

దేవరకద్ర: వదిన అంత్యక్రియలకు వెళ్తూ మార్గ మధ్యలో మరదలు మృతి చెందిన ఘటన బుధవారం దేవరకద్ర నియోజకవర్గంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన చాకలి చంద్రమ్మకు (68) రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. చాకలి చంద్రమ్మ అంత్యక్రియలను ముచ్చింతలలో చేసేందుకు బంధువులు ఏర్పాట్లు చేశారు. దీంతో మూసాపేట మండలం సంకలమద్దికి చెందిన మృతురాలి మరదలు పేరూర్ నర్సమ్మ (52) అంత్యక్రియలకు హాజరు కావడానికి మరో ఇద్దరు బంధువులతో కలిసి దేవరకద్రకు చేరుకుంది. ముచ్చింతలకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా అకస్మాత్తుగా నర్సమ్మ కిందపడింది. వెంటనే వైద్య పరీక్షలు చేయించగా అప్పటికే నర్సమ్మ గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిసింది.

ఒక వైపు తల్లి.. మరో వైపు అత్త

దేవరకద్రలో మృతి చెందిన పేరూర్ నర్సమ్మకు ముగ్గురు కుమార్తెలు.. వారిలో శోభారాణి అనే కుమార్తెను ముచ్చింతలలోని చాకలి చంద్రమ్మ కొడుకుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే అత్త చాకలి చంద్రమ్మ శవంతో అంబులెన్స్‌లో స్వగ్రామానికి వస్తున్న శోభారాణికి తన తల్లి నర్సమ్మ దేవరకద్ర బస్టాండ్‌లో మృతి చెందిన విషయం తెలిసింది. ఒక వైపు అత్త అప్పటికే మృతి చెందగా.. ఇప్పుడు తల్లి మృతి చెందడంతో శోభారాణి పరిస్థితి దయనీయంగా మారింది. గురువారం ముచ్చింతలలో చాకలి చంద్రమ్మ, సంకలమద్దిలో పేరూర్ నర్సమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

కారు బోల్తా.. వైద్య విద్యార్థులకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం


రోడ్డు ప్రమానికి గురైన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న ప్రయాణికులు

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఎస్‌వీఎస్ కళాశాలకు చెందిన నలుగురు పీజీ వైద్య విద్యార్థులకు గాయాలు కాగా, విఠల్ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహించేందుకు నలుగురు పీజీ వైద్య విద్యార్థులు విఠల్, స్రవంతి, విష్ణుతో పాటు మరొకరు ఒకే కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగనూర్ గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు 108లో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన విద్యార్థుల్లో విఠల్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన్నట్లు సమాచారం.

పిడుగుపాటుకు యువకుడి బలి



చిన్నంబావి: మండలంలోని మియాపూర్ గ్రామంలో పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన బుధవారం ఘటన చోటు చేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన గోపాల సహదేవుడు, సుగుణమ్మ కుమారుడు బాలరాజు (18) గొర్రెలను మేపేందుకు పొలానికి వెళ్లాడు. బుధవారం సాయంత్రం పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీపురం గ్రామంలో చోటు చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శ్రీపురం గ్రామానికి చెందిన గుంటి శాంతయ్య(50)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామంలోని ఊరచెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. బుధవారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాని చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుడి మృతి

అమరచింత: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాంరెడ్డిపల్లే గ్రామ పంచాయతీ కార్మికుడు సురేష్ (35) మంగళవారం అర్ధరాత్రి సమయంలో మరణించాడు. ఈనెల 3న మండలంలోని నాగల్ కడ్మూర్ గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

సుంకేసుల డ్యాం నుంచి నీటి విడుదల

రాజోళి: మండల కేంద్రం శివారులో గల తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల డ్యాం నుంచి బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి 13,236 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో మూడు గేట్లు తెరిచి అంతే స్థాయిలో నీటిని దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కులు విడుదల చేశారు.

రామన్‌పాడులో 1,016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం కొంత మేరకు పెరిగింది. తాగునీటి కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను బుధవారం నాటికి 1,016 అడుగులకు చేరింది. కుడి, ఎడమ కాల్వల ద్వారా 7 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఉద్యోగం పోయిందని..

ఇటిక్యాల: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన భరత్ కుమార్ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఇటీవల ఉద్యోగం కోల్పోవడంతో భరత్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మూడు ఎద్దుల మృతి



మాగనూర్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మూడు ఎద్దులు మృతి చెందిన ఘటన మండలంలోని కోల్పూర్‌లో బుధవారం జరిగింది. మందిపల్లికి చెందిన రైతు రంగప్ప వరి కోతలు ముగియడంతో మేత కోసమని ఎద్దులను కృష్ణ నది సమీపంలో వదిలేశారు. మేత మేసే క్రమంలో ఎద్దులు నది దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై ఒకే సారి మూడు ఎద్దులు మరణించాయి. ఎద్దులు మృతి చెందడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని అధికారులను కోరారు.